క్లుప్తంగా

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు



డీఎస్‌ఓతో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాలో పీడీఎస్ (రేషన్) బియ్యం పక్కదారి పట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ కొంకతి లక్ష్మీనారాయణ ఆదేశించారు. ఆయన మంగళవారం డీఎస్‌ఓ రాజారఘువీర్, డీఎం నాగసుధతో సమావేశమయ్యారు. ఇటీవల కాకినాడ జిల్లాలో రేషన్ బియ్యం పక్కదారి పట్టడంపై వివాదమైన నేపథ్యంలో జిల్లాలో అలాంటి పరిస్థితులు లేకుండా చూడాలని ఆదేశించారు.

సీపీఐ కార్యకర్తకు పరామర్శ

కర్నూలు(సెంట్రల్): సీపీఐ ఆఫీసు కార్యదర్శిగా ఉన్న రమేష్‌స్వామి పెరాలలిస్ స్ట్రోక్‌తో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మంగళవారం ఆయన్ను పరామర్శించారు. ఎంఎం – 6 వార్డులో చికిత్స పొందుతున్న ఆయన్ను నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డితో కలిసి పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

వర్చువల్ ల్యాబ్ పనితీరు పరిశీలన



వర్చువల్ ల్యాబ్ టెస్టును పరిశీలిస్తున్న డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్

కర్నూలు (సిటీ): జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేలా డీఈఓ కార్యాలయంలో వర్చువల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్ ద్వారా ఉపాధ్యాయుల కొరత ఉండే హైస్కూళ్లలోని విద్యార్థులతో పాటు మిగిలిన విద్యార్థులందరికీ ఆయా సబ్జెక్టుల నిపుణుల చేత విద్యాబోధన చేయిస్తారు. ఈ ల్యాబ్‌ను మంగళవారం డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ పరిశీలించారు. ఎన్ని హైస్కూళ్లకు లైన్ కనెక్ట్ అవుతుందో చెక్ చేశారు. 140 స్కూళ్లకు పైగా లైన్ కనెక్ట్ అయ్యింది. గత ప్రభుత్వం డిజిటల్ విద్యలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు అందించిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ) అందించింది. వీటి ద్వారా విద్యార్థులు వర్చువల్ ల్యాబ్‌లో సబ్జెక్టు నిపుణులు బోధించే తరగతులకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ తెలిపారు. జిల్లాలో 361 ప్రభుత్వ యాజమాన్య ఉన్నత పాఠశాలలు ఉండగా ఇందులో 340 స్కూళ్లకు వర్చువల్ ల్యాబ్ ద్వారా బోధన అందించేందుకు అవకాశం కల్పించారు. జిల్లాలో 511 సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. టీచర్ల కొరతను దృష్టిలో పెట్టుకుని వర్చువల్ ల్యాబ్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేశారు. నాలుగైదు రోజుల్లో ఈ ల్యాబ్ విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది.

నేడు కాగడాల ర్యాలీ

కర్నూలు కల్చరల్: హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బంగ్లాదేశ్ హిందువుల రక్షణను డిమాండ్ చేస్తూ బుధవారం సాయంత్రం 4 గంటలకు వివేకానంద సర్కిల్ (రాజ్‌విహార్) నుంచి కలెక్టరేట్ వరకు కాగడాల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ధార్మిక సంస్థల ప్రతినిధులు, హిందువులు అందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ



విద్యార్థి నవీన్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం నిర్మల వసంత కుమారి

సి.బెళగల్: రాష్ట్రస్థాయి రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటిన బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నవీన్‌ను హెచ్‌ఎం నిర్మల వసంతకుమారి అభినందించారు. మంగళవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించి విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి నవీన్ గత నెల కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడని, జిల్లా జట్టు తరఫున ఈనెల 2వ తేదీన గుంటూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి 68వ రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నాడని తెలిపారు. రాష్ట్రస్థాయిలో కర్నూలు జట్టు రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించిగా, జట్టులో నవీన్ చక్కటి ప్రతిభ కనబరిచాడని హెచ్‌ఎం చెప్పారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు విద్యార్థి నవీన్, పీఈటీ సత్యకుమార్‌ను అభినందించారు.

- మార్గశిర మాసంలో మంచి ముహూర్తాలు
- మోగనున్న పెళ్లి బాజాలు
- 4, 7, 10 తేదీల్లో శుభ ముహూర్తాలు
- 7వ తేదీన వేలాది పెళ్లిళ్లు
- డిసెంబర్ 25 వరకూ శుభ ఘడియలే

శ్రీరస్తు.. కల్యాణమస్తు



కల్యాణ వేదిక డిజైన్



కర్నూలు కల్చరల్: వివాహం ప్రతి ఒక్కరి జీవితంలో మధురానుభూతి. తమ పిల్లల వివాహాలను అత్యంత వేడుకగా జరిపించాలని తల్లిదండ్రులు ఆరాట పడుతుంటారు. దానికి తగ్గ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మార్గశిర మాసం ప్రారంభం కావడంతో పెళ్లిళ్ల సదండి మళ్లీ ప్రారంభం కానుంది. ఈ మాసంతో పాటు వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో కూడా జిల్లావ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. మార్చి రెండో వారం నుంచి శుక్ర మౌఢ్యమి (మూఢం) రానుండటంతో ఇప్పుడున్న ముహూర్తాల్లోనే పెళ్లిళ్లు చేయాలని పెద్దలు ఆరాట పడుతున్నారు. ప్రస్తుతం కార్తీక మాసం ముగిసింది. కార్తీకంలో పెళ్లిళ్లు జరిగినా పెద్దగా లేవనే చెప్పొచ్చు. ఈనెల 2వ తేదీన మార్గశిర మాసం ప్రారంభమైంది. ఈ మాసంలోనే పెళ్లిళ్లు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ నెల 4,7,10 తేదీల్లో ఎక్కువ పెళ్లిళ్లు ఉన్నాయి. 7వ తేదీ ఒక్క రోజే వందల సంఖ్యలో జంటలు ఒక్కటి కానున్నాయి.

మార్కెట్‌లో మస్తు వ్యాపారం

మార్గశిర మాసం ప్రారంభం కావడంతో శుభకార్యాలు ప్రారంభమయ్యాయి. దీంతో వివిధ రకాల వస్తువుల కొనుగోళ్లతో మార్కెట్‌లో మస్తు వ్యాపారం జరుగుతోంది. జిల్లా కేంద్రాలు కర్నూలు నగరం, నంద్యాల పట్టణాల్లోని బంగారు, వస్త్ర, కిరాణం దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ప్రతి రోజు అన్ని రకాల వ్యాపార లావాదేవీలు సుమారు రూ.5 కోట్ల వరకు ఉన్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. వారివారి స్తోమతను బట్టి పెళ్లిళ్ల ఖర్చులు పెడుతున్నారు.

ట్రెండ్‌కు తగ్గట్లుగా..

వివాహ వేడుకలంటే గతంలో బ్యాండ్ మేళాలు, భాజా భజంత్రీలు, పూల మండపాలు, వీడియో షూటింగ్‌లు వంటివి చాలా సాధారణంగా ఉండేవి. మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా వివాహ ముహూర్తానికి ముందే సంగీత్ కార్యక్రమాలు, ప్రీ వెడ్డింగ్, పోస్ట్ వెడ్డింగ్ షూట్లకు ఇతర ప్రాంతాల లొకేషన్లకు, ప్రకృతి, చారిత్రక ప్రాంతాలకు వెళ్తున్నారు. సినిమాటిక్‌గా వధూవరులచే స్పెషల్ సాంగ్స్ రూపకల్పన చేసి అవి ముందుగానే సోషల్ మీడియాలో విడుదల చేయడం, కల్యాణ వేదికపై ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై ప్రదర్శించడం లాంటి విభిన్న సంస్కృతిని అవలంభిస్తున్నారు.

ఉపాధి మార్గాలు

మార్గశిర మాసంలో వరుసగా పెళ్లి ముహూర్తాలు ఉండటంతో వివిధ రంగాల వారు ఉపాధి పొందుతున్నారు. కల్యాణ మండపాలకు బాగా డిమాండ్ పెరిగింది. పూల డెకరేషన్, లైటింగ్ వంటి పనులు చేస్తున్న వారికి చేతి నిండా పనులు లభిస్తున్నాయి. బోటిక్స్, బ్యూటీషియన్లకు డిమాండ్ పెరిగింది. ఫుడ్ క్యాటరింగ్ వారు, వేద పండితులు, బజంత్రీల వారు బిజీబిజీగా ఉండనున్నారు.

పెళ్లి ముహూర్తాల వివరాలు

- డిసెంబర్ మార్గశిర మాసంలో 4, 5, 6, 7, 8, 11, 12, 14, 15, 20, 21, 26, 26, 27, 28 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి
- 2025 జనవరి పుష్యమాసంలో 30వ తేదీ వరకు వివాహాలు, ఇతర శుభ ముహూర్తాలు లేవు.
- జనవరి 31వతేదీ మాఘ మాసం ప్రారంభమవుతుంది. 31న మంచి ముహూర్తం ఉంది.
- ఫిబ్రవరి మాఘ మాసంలో 2, 6, 7, 8,9, 12,13, 14, 15, 16, 21, 22, 22, 23, 26న ముహూర్తాలు న్నాయి.
- మార్చి ఫాల్గుణ మాసంలో 2, 6, 9, 12, 15, 16వ తేదీ వరకు శుభకార్యాలకు బాగుంది. అక్కడి నుంచి శుక్ర మౌఢ్యమి ప్రారంభం కావడంతో ముహూర్తాల కోసం మళ్లీ నెల రోజులు ఆగాల్సిందే.

బుకింగ్‌లు బాగున్నాయి



డిసెంబర్ నెలలో పదుల సంఖ్యలో మంచి ముహూర్తాలు ఉన్నాయి. వరుసగా పెళ్లి ముహూర్తాలు ఉండటంతో వధూవరుల తల్లిదండ్రులు వారి వారి బడ్జెట్‌కు తగిన విధంగా ముందుగానే ఫంక్షన్ హాల్స్‌ను బుక్ చేసుకుంటున్నారు. కల్యాణ మండపాలకు బాగా డిమాండ్ ఉంది. ఇప్పటికే చాలా ముహూర్తాలకు ఫంక్షన్ హాల్ బుక్ చేసుకున్నారు. – మధు, ఏఎంఆర్ ఫంక్షన్ హాల్, నిర్వాహకులు

మార్గశిరంలో ముహూర్తాలు ఎక్కువే



మార్గశిర మాసం డిసెంబర్ పొడవునా ముహూర్తాలు ఉన్నాయి. ఈ నెలలో 4, 7, 10 తేదీల్లో ఎక్కువ శుభకార్యాలు ఉన్నాయి. జనవరిలో పుష్యమాసం కావడంతో పెద్దగా ముహూర్తాలు లేవు. పెళ్లిళ్లతో పాటు గృహ ప్రవేశాలు, నామకరణాలు, ఎంగేజ్ మెంట్‌లు, కేశఖండన లాంటి వేడుకల నిర్వహణకు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. – వేదాంతం రంగనాథ ఆచార్యులు, పండితులు, కర్నూలు

నేడు ఘంటసాల జయంతి

కర్నూలు కల్చరల్: ఘంటసాల గాన కళా సమితి ఆధ్వర్యంలో పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతిని బుధవారం ఉదయం 8.30 గంటలకు ఆయకార్ భవన్ ఎదురుగా ఉన్న ఘంటసాల విగ్రహం వద్ద నిర్వహించనున్నట్లు సమితి సభ్యులు తెలిపారు. నగరంలోని ప్రముఖులు, కళా పోషకు లు, ప్రముఖ వైద్యులు పాల్గొంటారని వెల్లడించారు.

నేడు సంగీత విభావరి

పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతిని పురస్కరించుకొని బుధవారం సాయంత్రం 6 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఘంటసాల సంగీత విభావరి ఏర్పా టు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. పాకాల ఆర్ట్స్ ఆధ్వర్యంలో శ్రీశైలం ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కొండయ్య సారథ్యంలో సంగీత విభావరి ఉంటుందని పేర్కొన్నారు. గాయనీ గాయకులు శ్రీనివాసులు, పద్మావతి, శ్రీదేవి, యశోధ హాజరై సంగీత కచేరి నిర్వహిస్తారని తెలిపారు. ఘంటసాల గాన కళా సమితి అధ్యక్షులు బీఎస్‌రావుకు సన్మానం ఉంటుందని తెలిపారు.

బీజేపీతో యువతకు తీవ్ర అన్యాయం

కర్నూలు(సెంట్రల్): కేంద్రంలోని బీజేపీ పాలనలో యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ప్రధానమంత్రి నరేంద్రమోదీ యువతను మోసం చేశారని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమతా నాగిరెడ్డి విమర్శించారు. మంగళవారం కళావెంకట్రావు భవన్‌లో జిల్లా యువజన కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఆమెతోపాటు రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు, డీసీసీ అధ్యక్షుడు పి.మురళీ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగాలు కల్పించే ఒక్క పరిశ్రమను కూడా మోదీ స్థాపించడం లేదన్నారు. ఉన్న పరిశ్రమలను ప్రైవేట్‌కు అప్పగించి ఉద్యోగులను తొలగించేలా ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. విద్యుత్ ఒప్పందాలతో అదానీ, అంబానీల పొట్ట నింపుతున్నార న్నారు. డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర బాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీబాషా, సమన్వయకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

రాయల్ ఓక్‌కు మొట్టికాయ

కర్నూలు (లీగల్): వినియోగదారుడు కొన్న వస్తువుకు రెండుసార్లు డబ్బు చెల్లించేందుకు కారణమైన రాయల్ ఓక్ యాజమాన్యానికి జిల్లా వినియోగదారుల కమిషన్ మొట్టికాయ వేసింది. వినియోగదారుడికి సదరు వస్తువు ధర రూ.64 వేలు 12 శాతం వడ్డీతో పాటు చెల్లిస్తూ, కోర్టు ఖర్చులు, పరిహారం కింద మరో రూ.30 వేలు యాజమాన్యం చెల్లించాల్సిందేనని కమిషన్ ప్రెసిడెంట్ కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎన్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్లు తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. కర్నూలులోని బాలాజీ నగర్‌కు చెందిన ఎం.శ్రీధర్‌బాబు 2022 జనవరి 11న స్థానిక రాయల్ ఓక్ ఫర్నిచర్ దుకాణంలో అక్కడి బజాజ్ ఫైనాన్స్ ద్వారా రుణం పొంది వాయిదా పద్ధతిలో చెల్లించేలా రూ.64 వేలకు ఒక సోఫా కొన్నాడు. తర్వాత సోఫాసెట్ నచ్చకపోవడంతో దాన్ని వద్దని అదే పద్ధతిలో మరో సోఫాను కొని మొదటి రుణాన్ని రద్దు చేయాలని రాయల్ ఓక్ యాజమాన్యాన్ని కోరాడు. అందుకు సమ్మతించిన యాజమాన్యం మొదటి రుణాన్ని రద్దు చెయ్యకుండా నిర్లక్ష్యం చేసింది. తత్ఫలితంగా వినియోగదారుడు బజాజ్ వారికి రెండు రుణాలు చెల్లించాల్సి వచ్చింది. దీంతో వినియోగదారుడు సదరు యాజమాన్యాన్ని డబ్బు వాపసు ఇవ్వాలని కోరాడు. యాజమాన్యం తిరిగివ్వకుండా దాదాపు 26 నెలలు కాలయాపన చేసింది. దాంతో వినియోగదారుడు శ్రీధర్ బాబు మే 2024లో కమిషన్‌ను ఆశ్రయించాడు. విచారించిన కమిషన్ వినియోగదారుడి అభ్యర్థనను లెక్కచేయకపోవడం, ఆ తర్వాత కూడా నెలల తరబడి పట్టించుకోకపోవడం సేవా లోపమేనని తీర్పు చెప్పింది. బాధితుడికి వడ్డీతో కలిపి పరిహారం చెల్లించాలని సంస్థను ఆదేశించింది.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు

కర్నూలు(టౌన్): మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన మహిళా సాధికారిక కన్వీనర్ షహనాజ్ బేగం మాట్లాడుతూ.. మహిళలకు కరాటే, ఉషూ వంటి క్రీడలు అవసరమన్నారు. క్రమం తప్పకుండా శిక్షణ తీసుకొని ఉన్నతంగా రాణించాలన్నారు. అనంతరం విద్యార్థినులకు బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు బెల్టులు ప్రదానం చేశారు.

కోలుకోలేక వృద్ధురాలి మృతి

కల్లూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందింది. వివరాలు.. పుసులూరు గ్రామానికి చెందిన గోపాలమ్మ (77) సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాలయ్యింది. స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోలుకోలేక మంగళవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ ధనుంజయ తెలిపారు.

యువకుడి మృతి

పత్తికొండ(తుగ్గలి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. పత్తికొండ పోలీసులు తెలిపిన వివరాల మేరకు..హోసూరు గ్రామానికి చెందిన సునీతమ్మతో భర్త శ్రీనివాసులు కొంత కాలంగా దూరంగా ఉంటున్నారు. ఉన్న పొలంలో ఆమె ముగ్గురు పిల్లలను పోషిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఆర్థిక ఇబ్బందులు, తండ్రి దూరంగా ఉంటున్నాడని మనస్తాపానికి గురైన కుమారుడు బ్రహ్మయ్య (20) ఈ నెల 2న పురుగు మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన తండ్రి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు వివరించారు.

టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నివారణ



మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్

కర్నూలు(హాస్పిటల్): క్రమం తప్పకుండా సమయానుసారంగా బిడ్డకు టీకాలు ఇవ్వడం వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్ చెప్పారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో మంగళవారం పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న క్షేత్రస్థాయి పర్యవేక్షకులకు సార్వత్రిక వ్యాధినిరోధక టీకాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగప్రసాద్ మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు షెడ్యూల్ ప్రకారం టీకాలు ఇవ్వడం వల్ల భవిష్యత్‌లో పోలియో, కంఠసర్పి, క్షయ, కామెర్లు, కోరింత దగ్గు, ధనుర్వాతం, న్యూమోనియా వంటి జబ్బులు రాకుండా నియంత్రించవచ్చని తెలిపారు. సర్వైలెన్స్ అధికారి డాక్టర్ వరుణ్ ధర్మన్ మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పిల్లల పేర్లు, వారికిచ్చే టీకాల వివరాలను కచ్చితంగా పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాక్సిన్ వేసే విధానం, ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేసినప్పుడు సేకరించాల్సిన వివరాలు, నివేదికలను ఎలా తయారు చేయాలని, ఆరోగ్య కేంద్ర స్థాయిలో ప్రణాళికలు ఎలా రూపొందించుకోవాలనే అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త హేమలత, న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు పద్మావతి, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి చట్టాలు



వీల్‌చైర్లను అందజేస్తున్న జిల్లా జడ్జి జి.కబర్ది

కర్నూలు (అర్బన్): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అంబికా శిశు కేంద్రంలో న్యాయవిజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. మానసిక దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని సరైన రీతిలో ఉపయోగించి సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. మానసిక దివ్యాంగుల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవల పథకం 2005 గురించి వివరించారు. ఉచిత న్యాయ సహాయం కోరేవారు లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100ను ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం మానసిక దివ్యాంగులకు 5 వీల్ చైర్లను అందజేశారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ఆలయం వద్ద భక్తుల రద్దీ

కర్నూలు(రూరల్): జిల్లా కేంద్రానికి సమీపాన వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూకట్టారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ తదితర పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

బీసీ నేతను విమర్శించడం దారుణం



సంఘీభావం వ్యక్తం చేస్తున్న బీసీ నేతలు

కర్నూలు(అర్బన్): నాలుగు దశాబ్దాలుగా బీసీల హక్కులు, సమస్యల కోసం నిరంతరం ఉద్యమాలు చేస్తున్న ఆర్.కృష్ణయ్యను విమర్శించడం దారుణమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా స్థితిమంతులైన కుటుంబం నుంచి వచ్చిన కృష్ణయ్యపై వ్యక్తిగత విమర్శలకు పాల్పడిన అనకాపల్లికి చెందిన గురవయ్యయాదవ్ వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణయ్య చేసిన పోరాటాల ఫలితంగానే బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి గృహాలు, బీసీ స్టడీ సర్కిళ్లు, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు వచ్చాయన్నారు. ఆయన జీవితం అంతా బీసీల అభివృద్ధి కోసం అలుపులేని పోరాటాలు నిర్వహించారన్నారు. ఆర్.కృష్ణయ్యను విమర్శిస్తే చట్టప్రకారం పోరాడతామన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు, శాలివాహన సంఘం రాష్ట్ర కార్యదర్శి నూగురు వెంకటేశ్వర్లు, బాల సంజన్న, మైనారిటీ నాయకులు, రాష్ట్ర కార్యదర్శి అన్వర్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఫెంగల్.. రైతన్న గుండె‘జల్లు’



పసుపల గ్రామంలో సాగుచేసిన పొగాకు పంట



గార్గేయపురంలో వర్షానికి తడిసిన పొగాకు దిగుబడి

కర్నూలు(రూరల్): ఫెంగల్ తుపాను పొగాకు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పంట దిగుబడి చేతికందే దశలో తుపాను రూపంలో ముప్పు పొంచి ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని గార్గేయపురం, దిగువపాడు, శివరామాపురం, పడిదెంపాడు, పూడురు, పసుపల, పి.రుద్రవరం, తదితర గ్రామల్లో పొగాకు పంటను అధికంగా సాగు అవుతుంది. గతేడాది పొగాకు మంచి ధర పలకడంతో ఈ ఏడాది రైతన్నలు అధిక విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేశారు. పంటకాలం పూర్తయి ప్రస్తుతం పొలంలో పందిర్లు వేసి పొగాకు ఎండబెట్టే పనులు జరుగుతున్నాయి. కూలీలకు డిమాండ్ ఏర్పడడంతో పొగాకు పంట కోతకు ఎకరానికి రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చవుతోంది.

ఎకరానికి రూ.38 వేల వరకు ఖర్చు

కూలీల కొరత, కూలి రేట్లు పెరగడం, పంటకు తెగుళ్లు, మందుల పిచికారీ వంటి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పంట సాగు చేపట్టిన రైతులకు ప్రస్తుతం ఫెంగల్ తుపాను భయం పట్టుకుంది. మండలంలో పొగాకు 1968 హెక్టర్లలో సాగైంది. అర్బన్ పరిధిలో 85 హెక్టర్లలో పొగాకు సాగైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఎకరం విస్తీర్ణంలో పొగాకు సాగు చేపట్టేందుకు (కోతలతో కలుపుకుని) రూ.38 వేలు ఖర్చవుతుంది. కౌలు రైతులు అదనంగా మరో రూ.10 వేలు కౌలు చెల్లించి పంట సాగు చేపట్టారు.

ఆందోళన చెందుతున్న రైతులు

ఈ ఏడాది పైరు ఆశాజనకంగా ఉండడంతో మంచి ఆదాయం వస్తుందని సంబరపడిన రైతన్నలకు ఫెంగల్ తుపాను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. గత రెండు రోజుల నుంచి తుపాను ప్రభావంతో మోస్తరు వర్షం కురుస్తుండడంతో పంటను కోసి ఆరబెట్టుకున్న రైతులు దిగాలు చెందుతున్నారు. ఆరబెట్టిన పొగాకు వర్షంలో తడిస్తే నాణ్యత తగ్గుతుంది. ఆకు నల్లగా మారితే వ్యాపారులు కొనుగోలు చేసుందుకు ముందుకురారు. అప్పుడు వారు చెప్పిన ధరకే పంటను అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆరబెట్టిన పొగాకు బేళ్లు వర్షానికి తడవకుండా పట్టలను కప్పిఉంచారు. ఈదురు గాలులకు పట్టలు తొలగిపోకుండా కంటికి రెప్పలా దిగుబడిని కాపాడుకుంటున్నారు.

పొగాకు కోతలు వాయిదా వేసుకోవాలి

పొగాకు పంట కోత చేపట్టకపోయి ఉంటే తుపాను వల్ల ఎలాంటి నష్టం ఉండదు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు పొగాకు కోతలను వాయిదా వేసుకోవాలి. పంట కోతలు చేపట్టిన వారు దిగుబడి వర్షానికి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని. ఆరబెట్టిన పొగాకులో తేమ శాతం ఎక్కువగా ఉంటే వ్యాపారస్తులు ధర తగ్గిస్తారు. అలా జరగకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– ఏఓ, రూఫస్‌రొనాల్డ్

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు

- ఈనెల 9 నుంచి సమ్మెబాట



కమిషనర్ రవీంద్రబాబుకు సమ్మె నోటీసు ఇస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు

కర్నూలు (టౌన్): మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మనోహర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక నగరపాలకలో కమిషనర్ రవీంద్ర బాబును కలిసి యూనియన్ నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 నుంచి 30 సంవత్సరాలుగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో వాటర్ లైన్‌మెన్, ఫిట్టర్, లీకేజీ మెకానిక్స్, పంప్ ఆపరేటర్స్, ఎలక్ట్రీషియన్స్, వీధి దీపాలు, పార్కులు, కంప్యూటర్ ఆపరేటర్స్, వర్క్ఇన్‌స్పెక్టర్స్, బోర్‌వెల్ మెకానిక్స్ ఇలా... 200 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమకు వేతనాలు పెంచడం లేదన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల్లో 10 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని పర్మినెంట్ చేయాలన్నారు. జీఓ నంబర్ 63 ప్రకారం వేతనాలు చెల్లించాలని, స్కిల్డ్, హైసిల్డ్ వేతనాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. యూనియన్ నాయకులు వెంకటేష్, యాసిన్ బేగ్, జ్ఞానమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): ఈనెల 7వ తేదీ నుంచి పశ్చిమగోదావరి జిల్లా మాటేరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో స్త్రీ, పురుషుల జట్లు సత్తా చాటాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో క్రీడాకారులకు పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పోటీలను అవకాశంగా తీసుకొని పతకాలు సాధించాలని పిలుపునిచ్చారు. బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధి దాదాబాషా, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలి

ఓర్వకల్లు: ప్రతి గ్రామంలో కుష్టు, టీబీ లక్షణాలున్న వారిని గుర్తించి, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలని కుష్టు వ్యాధి నివారణ జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జునరెడ్డి హుసేనాపురం ఆశాకార్యకర్తలకు సూచించారు.